ఆ రోడ్డులో ప్రయాణం.. భయం భయం

- రోడ్డు మార్జిన్‌ను కప్పేసిన మూల్లాం వెదురుపొంతలు
- ఏడాది కాలంగా ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- రోడ్డు అర్‌అండ్‌బిది, వెదురు అటవీశాఖది
- దీంతో సమన్వయం లోపం


రోడ్డు మార్జిన్‌కు కప్పేసిన మూల్లాం వెదురుపొంతలు

నాతవరం : ఈ రోడ్డులో ప్రయాణం కొండకోనలు సారంగం మార్గంలో వెళ్లే విధంగా మూల్లాం వెదురు పొంతలు పెరిగి ప్రమాదాలకు నిలయంగా మారింది. నర్సీపట్నం, తుని మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుపై పెడిమికొండ అటవీ నర్సరీ ప్రాంతంలో ప్రయాణించేందుకు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఇక్కడ రోడ్డును కప్పేసి వెదురుపొంతలు పెరిగిపోయాయి. ఈ వెదురు పొంతలు సాధారణ రకం కాకుండా మూల్లాం రకం పొంతలు కావడంతో చేయి తగిలితే ముళ్లు గుచ్చుకుంటాయి. ఈ మూల్లాం పొంతలు అర్‌అండ్‌బీ రోడ్డు మార్జిన్ లోపలకు పెరిగిపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకోవాలంటే అనేక అవస్థలు పడుతున్నారు. మండలంలో తాండవ జంక్షన్ నుంచి గాంధీనగరం మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పెడిమికొండ అటవీశాఖ నర్సరీ ఉంది. అటవీశాఖ, అర్‌అండ్‌బీ అధికారుల సమన్వయ లోపం కారణంగా ఏడాది కాలంగా ఈ సమస్య వెంటాడుతుంది. గతంలో రోడ్డుపైకి పెరిగిన వెదురుపొంతలు ఎప్పటికప్పుడు వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అటవీశాఖ అధికారులు తొలగించేవారు. ఇటీవల ఈ రోడ్డు మార్జిన్‌లో విద్యుత్ లైను ఏర్పాటుకు కొత్తగా స్తంభాలు ఏర్పాటు చేయడంతో సమస్య మరింత పెరిగింది. కొత్తగా వచ్చిన అటవీశాఖ అధికారులు కళ్ల ముందే రోడ్డు మార్జిన్‌ను కప్పేసి మూల్లాం వెదురుపొంతలు దర్శనమిస్తున్నా కనీసం పట్టించుకోలేదు. రోడ్డు మార్జిన్‌ను కప్పేసిన వెదురుపొంతలు కారణంగా ఏడాది కాలంగా అనేక మంది ప్రమాదాలకు గురయ్యారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు ఈ రోడ్డులో ప్రయాణించేందుకు హడలెత్తిపోతున్నారు. ఏడాది కాలంగా సుమారు 45 ప్రమాదాలు జరిగాయి. వాటిలో కొన్ని పోలీసుస్టేషన్‌లో కేసులు నమోదు కాగా మరికొన్ని రాజీ ప్రయత్నంలో వెళ్లిపోయేవారు. పెడిమికొండ అటవీ నర్సరీలో జరుగుతున్న ప్రమాదాల పట్ల ఈ ప్రాంతం ఆనుకుని ఉన్న గాంధీనగరం, శృంగవరం సర్పంచులు పాతాళ అప్పారావు, ఉలబాల శ్రీనివాస్ మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు తప్ప నేటికీ పరిష్కరించలేదు. ఈ ప్రాంతీయులతో పాటు ఈ మార్గంలో నిత్యం ప్రయాణించేవారు అటవీ, ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారుల దృష్టికి స్వయంగా సమస్యను తీసుకెళ్లినా అటువైపు కనీసం కన్నెత్తి చూడలేదు. రోడ్డు అర్‌అండ్‌బీ మూల్లాం పొంతలు అటవీ శాఖ పరిధిలోకి వస్తాయి. దీంతో అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం అధికంగా కనిపిస్తోంది.



మైలురాయిని కప్పేసిన తుప్పలు


నర్సీపట్నం, తుని మధ్య రోడ్డులో ఆర్టీసీ బస్సు


కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైను

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..



నిత్యం రాకపోకలు సాగించే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై మూల్లాం వెదురుపొంతలు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకపోవడం దారుణం. ఈ మధ్య నేను తుని వెళ్తుంటే కళ్ల ముందే అటవీ నర్సరీలో ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సులో వెళ్లే వారు సైతం ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. వాహనాలు తప్పించుకునే క్రమంలో డ్రైవర్లు తగదాలు పడుతున్నారు. మండల సర్వసభ్య సమావేశంలో ప్రధాన సమస్యగా ప్రజాప్రతినిధులు సభలో ప్రస్తావించారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఇలాకాలో అధికారుల పనితీరు ఇలా ఉందంటే చాలా బాధేస్తుంది. ఇప్పటికైనా స్పందించే మంచిది.

– షేక్, రజాక్, మండల కోఆప్షన్ సభ్యుడు

అటవీశాఖ ఆధీనంలో..



రోడ్డు మాత్రమే మా పరిధిలో ఉంటుంది. రోడ్డు మార్జిన్‌లో మట్టి తీసేందుకు మా హక్కు లేదు. మూల్లాం వెదురుపొంతలు పూర్తిగా అటవీశాఖ అధీనంలోనే ఉన్నాయి. వాటిని తొలగించాలంటే వారి నుంచి మాకు అనుమతి ఉండాలి. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు చెప్పడం జరిగింది.

– నారాయణరెడ్డి, జేఈ అర్‌అండ్‌బీ

నిధుల్లేక జాప్యం..



ఈ సమస్య మా ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టడం జరిగింది. మూల్లాం వెదురుపొంతలు తొలగించాలంటే పెద్ద పని. సాధారణ రకం వెదురు అయితే కొనుగోలు చేస్తారు. మూల్లాం వెదురు ఎవరూ కొనుగోలు చేయరు. వాటిని తొలగించేందుకు నిధుల కోసం ప్రతిపాదనలు చేశాం. ప్రమాదాలు జరుగుతున్నాయని నా దృష్టికి చాలా మంది తీసుకువచ్చారు. మండల సమావేశంలో అడిగిన వెంటనే ఉన్నతాధికారులకు నివేదించాను.

– చిరంజీవి, అటవీశాఖ సెక్షన్ అధికారి

క్లుప్తంగా

హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

నర్సీపట్నం : హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో శనివారం బ్లడ్ సెంటర్ నందు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో ఉద్యోగులు, యువకులు, హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, విద్యార్థులు రక్తదానం చేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ఉమానారాయణ హాస్పటల్ డాక్టర్ మల్లికార్జున్, వి.వి.ఎస్ నర్సింగ్ హోమ్ డాక్టర్ నూకరాజు పాల్గొన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో 9 సార్లు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశామని హ్యాండ్స్ వ్యవస్థాపకులు టి.మల్లేష్ పేర్కొన్నారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన జి.శ్రీనివాస్ సన్మానించారు.

సప్లిమెంటరీ ఫలితాల్లో సత్తాచాటిన లక్ష్మీ ప్రసన్న


రుత్తల లక్ష్మీ ప్రసన్న

నర్సీపట్నం : శ్రీసాయి విద్యా సంస్థలు వారి డా..రాజేంద్రప్రసాద్ జూనియర్ కళాశాలలో చదివిన విద్యార్థిని రుత్తల లక్ష్మీ ప్రసన్న అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో 470 మార్కులకు 467 మార్కులు సాధించింది. విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ పి.నాగరాజు, ప్రిన్సిపాల్ ఎ.గోపాల్‌రావు, అధ్యాపకులు అభినందించారు.

కల్యాణ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అర్చనలు


ప్రత్యేక అలంకరణలో కల్యాణ వేంకటేశ్వరస్వామి

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. స్వామివారి ఆలయం చుట్టూ భక్తులు ఏడు పర్యాయాలు ప్రదక్షిణలు చేశారు. ఆలయంలో రాత్రికి భజన కార్యక్రమం, దాతలు సహకారంతో చద్ది ఏర్పాటు చేశారు.

ఏ కోడూరులో చిన్నారులకు టీకాలు


ఎ.కోడూరులో వ్యాక్సినేషన్ కార్యక్రమం

కె.కోటపాడు : ఎ.కోడూరులో శనివారం టీకాల కార్యక్రమం నిర్వహించారు. 19 మంది చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణులకు ధనుర్వాతం బారిన పడకుండా టీకాలు వేశారు. నిర్ణీత బిడ్డ వయస్సును బట్టి టీకాలను వేయించడం ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఏఎన్ఎంలు లక్ష్మి, సంతోషి, ఆశా కార్యకర్త సన్యాసమ్మ పాల్గొన్నారు.

వేణుమాధవుని ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట : కొండపాలెం గ్రామంలో శనివారం స్థానిక యాదవ సంఘం వారి ఆధ్వర్యంలో వేణుమాధవుని ఆలయ నిర్మాణ 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ వారు ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు వేణుమాధవుని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకున్నారు. సర్పంచ్ బంటు లక్ష్మి, రోలుగుంట పీఏసీఎస్ అకౌంటెంట్ పిల్లా నూకరాజు, కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీగా అన్నసమారాధన జరిపారు.

నిరుపయోగంగా పాఠశాల తరగతి భవనం


వాడుకలలో లేని తరగతి భవనం

కె.కోటపాడు : వారాడ శివారు యర్లవానిపాలెం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల తరగతి భవనం నిరుపయోగంగా మారింది. ఈ భవనం కొద్దిగా దెబ్బతినడంతో భవనంలో తరగతులు నిర్వహించడంపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. భవన సమస్యను గుర్తించిన విద్యాశాఖ అధికారులు 2013లో రాజీవ్ విద్యామిషన్ నిధులతో గ్రామంలో మరోచోట పాఠశాల అదనపు తరగతి భవనం నిర్మాణం చేపట్టారు. దీంతో మరమ్మతులకు గురైన పూర్వ తరగతి భవనం మరమ్మతు పనులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయని కారణంగా భవనం నానాటికీ బలహీన పడుతుంది. బలహీనమవుతున్న పాఠశాల భవనానికి మరమ్మతులు పనులు చేపట్టి ప్రభుత్వ శాఖల కార్యాలయాల నిర్వహణకైనా ఉపయోగించుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం ఎన్నిక


అధ్యక్ష, కార్యదర్శిని అభినందిస్తున్న నిర్వాహకులు

నర్సీపట్నం : మండల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా ఒమ్మి నూకరాజు, బొంతు సత్యవేణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నిర్వాహకుల సమస్యలను రాష్ట్ర నాయకత్వం ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపిక

మాకవరపాలెం : ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులకు మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈవోలు మూర్తి, జాన్‌ప్రసాద్ తెలిపారు. వీరిలో మాకవరపాలెం, జీ కోడూరు, గిడుతూరు ఉన్నత పాఠశాలల నుంచి నూకల జగదీశ్వర రావు, చెవ్వాకుల నవదీప్, కామిరెడ్డి సంపత్, జోగా స్టీఫెన్, జి.గౌరీశంకర్ ఉన్నారన్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.20 వేల చొప్పున నగదు, గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు. ఈ విద్యార్థులను ఎంఈవోలతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.

నాతవరం మండలంలో

నాతవరం : మండలంలో పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నగదు ప్రోత్సాహకాలకు ఎంపికైనట్టుగా ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు శనివారం విలేకరులకు తెలిపారు. తాండవ హైస్కూల్ నుంచి కె. వరహాలబాబు, శెట్టి పుష్ప, గునుపూడి స్కూల్ నుంచి జి.ప్రశాంతి, మర్రిపాలెం కస్తూర్బా పాఠశాల నుంచి సుర్ల వర్షిణి, రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి ఎస్.వెంకటరావు, నాతవరం హైస్కూల్ నుంచి వై.శంకరరావు ఎంపికయ్యారన్నారు. వీరికి అనకాపల్లి జిల్లా కేంద్రంలో గల పెంటకోట కన్వెన్షన్ హాల్లో ఈనెల 9వ తేదీన నగదుతో పాటు ప్రశంసా పత్రాలు విద్యార్థుల తల్లిదండ్రులు సమక్షంలో అందజేస్తారని ఎంఈవో వరహాలబాబు తెలిపారు.

బుచ్చెయ్యపేట : మండలంలో ఈ ఏడాదిలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 8 మంది విద్యార్థులను షైనింగ్ స్టార్ అవార్డులకు ఎంపిక చేసినట్టు ఎంఈవో బుద్ద కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. విజయరామరాజుపేట హైస్కూల్‌కు చెందిన కాండ్రేగుల శంకర్(581), బుంగా మనోహర్(557), బొంకల ఈశ్వర ప్రసాద్(530), సీతయ్యపేట హైస్కూల్‌కు చెందిన కొండపల్లి శ్రీ లక్ష్మి(578), గోకివాడ విజయజ్యోతి(578), జనపరెడ్డి నవీన్(573), వడ్డాది పీఎంఎస్ స్కూల్‌కు చెందిన పదిలం ఉషారాణి(564) మార్కులు సాధించిన విద్యార్థులు అవార్డుకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 9వ తేదీన జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డుల కింద ఒక్కో విద్యార్థికి రూ.20 వేలు నగదు, గోల్డ్ మెడల్, ప్రసంశా పత్రం అందిస్తారన్నారు.

రావికమతంలో..

రావికమతం : ఈ ఏడాది పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్టు ఏంఈవో తలుపులు తెలిపారు. ఎంపికైన వారిలో సోమిరెడ్డి ఉదయ్ ప్రసాద్ నాయుడు (కొత్తకోట ఆర్క్‌బర్డ్), కలిగిరి వర్షిత లాస్య (కేజీబీవీ, గర్నికం), మట్టా హేమ చందు (సిద్దార్ధ ఇంగ్లిష్ మీడియం , రావికమతం), పల్లా రామకృష్ణ (కొత్తకోట సెయింటు మేరీ), జుత్తాడ దివ్య (జెడ్పీ బాలికల హైస్కూల్ (రావికమతం), కోన భువన (పీఎస్సార్ ఎంజెడ్‌పి.స్కూల్ కొత్తకోట)ఉన్నారని, వీరు ఈ నెల 9న అనకాపల్లి జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రి చేతుల మీదుగా నగదు అవార్డు తీసుకుంటారని, ఎంపికైన విద్యార్థులకు సమాచారం ఇవ్వడం జరిగిందని ఆయన విలేకరులకు వివరించారు.

చోడవరంలో..

చోడవరం రూరల్: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో శ్రీవిజ్ఞాన్ విద్యార్థులు తమ సత్తా చాటారు. ఈ స్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ప్రభుత్వం వారిచ్చే ప్రతిభా పురస్కారాలకు (షైనింగు స్టార్స్) ఎంపికయ్యారు. వీరిలో యెడ్ల మోనీషా, పచ్చెర్ల డోలా హరిణి, కాశీపల్లి ఫవన్ కుమార్ నాయుడు ఉన్నారు. తమ స్కూల్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థులను ప్రిన్స్‌పాల్ జ్ఞానేశ్వరి అభినందించారు.

ఘనంగా పరదేశిమాంబ ఆలయ శంకుస్థాపన


వాకపల్లిలో పరదేశమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామ ప్రజలు, పెద్దలు

దేవరాపల్లి : వాకపల్లి గ్రామంలో పరదేశమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమంగా శనివారం ఘనంగా జరిగింది. వేదపండితులు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో అత్యంత నియమ నిష్టలతో ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలు, పెద్దలు అత్యంత భక్తి శ్రద్దలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. గ్రామ ప్రజల విరాళాలతో ఆలయ నిర్మాణాన్ని చేపడుతున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పెద్దలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో గాలి వర్షం


బుచ్చెయ్యపేట రోడ్డులో కురుస్తున్న వర్షం


చౌడువాడలో కురుస్తున్న వర్షం

బుచ్చెయ్యపేట : మండలంలో పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుండి తీవ్రంగా ఎండ కాయడంతో ప్రజలు ఎండవేడిమితో అల్లాడిపోయారు. సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో ఆకాశంలో కారుమబ్బులు కమ్ముకుని గాలీవర్షం కురిసింది. అప్పటి వరకు తీవ్ర ఎండతో అల్లాడిన ప్రజలు కురిసిన వర్షంతో సేద తీరారు. పలు గ్రామాల్లో ఎండిపోతున్న పలు రకాల పంటలకు వర్షం మేలు చేసింది.

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో కురిసిన వర్షంతో చల్లబడ్డ వాతావరణంతో ప్రజలు సేదతీరారు. కురిసిన వర్షంతో వరినారు మడులను సిద్ధం చేసేందుకు దుక్కులు చేపట్టనున్నట్లు రైతులు తెలుపుతున్నారు. కూరగాయల సాగుకు వర్షం మేలు చేస్తుందన్నారు. కె.కోటపాడు, గొండుపాలెం, చౌడువాడ తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

మాడుగుల రూరల్: ఉదయం నుంచి ఎండ తీవ్రత, సాయంత్రం అకస్మాత్తుగా మబ్బులు పట్టి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం శనివారం సాయంత్రం కురిసింది. అసలే ఉక్కపోత, దీనికి తోడు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం వల్ల కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో వృక్షాలు నేలకొరిగాయి.

వడ్డాదిలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ ప్రార్థనలు


వడ్డాది మసీద్‌లో ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు


మాకవరపాలెంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయతీ వడ్డాది మసీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం బక్రీద్ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన ముస్లింలు మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పలు గ్రామాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు మసీద్‌కు వెళ్లి ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి చిహ్నంగా బక్రీద్ పండగ నిలుస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు.

మాకవరపాలెం : బక్రీద్ పండగను మండలంలో ముస్లిలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ మేరకు శనివారం ఉదయం నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న ముస్లింలు మండల కేంద్రంలో ఉన్న మసీదుకు వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు. అనంతరం ఒకరికి ఒకరు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకొని, పేద ముస్లింలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోలుగుంట: మండలంలో పలు గ్రామాల్లో గల ముస్లింలు శనివారం బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సమీపంలో గల మసీదులకు వెళ్లి ప్రార్థనలు చేసుకున్నారు. స్నేహితులు, బంధువులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు.

మాడుగుల రూరల్ : బక్రీద్ పండగ సందర్భంగా కె.జె.పురం మసీదులో శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. త్యాగానికి మారుపేరుగా నిల్చిన పవిత్ర బక్రీద్ పండగ సందర్భంగా స్థానికులతో పాటు ఖండివరం, చీడికాడ, ఘాట్‌రోడ్డు, తదితర గ్రామాల నుంచి వచ్చిన ముస్లింలు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

రేషన్‌కు బదులు నగదు బదిలీ ప్రక్రియను విరమించుకోవాలి

- సుదూర గిరిజన గ్రామాలకు ఎండీయూ వాహనాలతో రేషన్ అందించాలి
- 90 శాతం మేర గ్యాస్ సిలిండర్ల లబ్ధిదారులకు జమ కాని నగదు
- ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న డిమాండ్



దేవరాపల్లి : ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్‌కు బదులు నగదు బదిలీ చేసే నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రేషన్ డిపోలకు సుదూరంగా గిరిజన గ్రామాల ప్రజలకు ఎండీయూ వాహనాలతో రేషన్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీడీఎస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు చట్ట ప్రకారం 14 రకాల నిత్యవసర వస్తువులను పంపిణీ చేయాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం పదే పదే రేషన్ అవసరం లేకపోతే డబ్బులు తీసుకోవచ్చునని రేషన్ లబ్ధిదారులను ప్రోత్సహించడం విడ్డూరంగా ఉందన్నారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలండర్ల పథకంలో 90 శాతం మేర లబ్ధిదారులకు నగదు ఖాతాలో జమకాలేదన్నారు. కేరళ రాష్ట్రంలో మాదిరిగా మూడు రకాల కార్డులను విధానాన్ని అమలు చేసి లబ్ధిదారులకు 17 రకాల నిత్యవసర సరుకులు అందించాలని కోరారు. రేషన్ మాఫియాకు ప్రధానంగా అధికార పార్టీ నాయకులే కారకులను ఆరోపించారు. మండలానికో ఏజెంట్‌ను నియమించుకొని రేషన్ బియ్యాన్ని సేకరించి రీసైక్లింగ్‌కు పాల్పడుతున్నారని విమర్శించారు. గతంలో వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా దేశంలో 1955లో పీడీఎస్ వ్యవస్థను ప్రవేశపెట్టారని, ఇప్పటికీ దేశంలో 80 కోట్ల మంది దీనిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అసమానతలను నిర్మూలించేందుకు రేషన్ పంపిణీని కొనసాగించాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. 2013 ఆహార భద్రత చట్టం ప్రకారం 14 రకాల నిత్యవసర సరుకులు అందించాలని వెంకన్న డిమాండ్ చేశారు.

అభయాంజనేయస్వామి ఆలయం ప్రారంభోత్సవం


ఆలయ కమిటీ నిర్వాహకులను సత్కరిస్తున్న ముత్యాలనాయుడు

చోడవరం: చాకిపల్లి పంచాయతీ రామజోగిపాలెం గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. శ్రీరామ..జయజయరామ అంటూ గ్రామమంతా మారుమోగింది. సర్పంచ్ పోతల జానకీ ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామంలో నూతనంగా అభయాంజనేయస్వామి ఆలయం నిర్మించారు. శనివారం ఈ ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం నుంచి వేదపండితుల వేద మంత్రాల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. హోమం, లక్ష తమలపాకు పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ మాడుగుల సమన్వయకర్త బూడి ముత్యాలనాయుడు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణంలో కృషి చేసిన సర్పంచ్ ప్రసాద్‌తోపాటు కమిటీ ప్రతినిధులను ముత్యాలనాయుడు అభినందించారు. పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తీర్థప్రసాదాలు ఇచ్చి భారీ అన్నసమారాధన నిర్వహించారు.

15 వాహనాలకు జరిమానా

కశింకోట : కశింకోటలో జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి నడుపుతున్న సుమారు 15 వాహనాలకు జరిమానా విధించినట్టు ఎస్ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించాలని, ఆటో ల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదని, కారులో సీటు బెల్టులను ధరించాలని వాహన చోదకులకు ఈ సందర్భంగా అవగాహన కలిగించామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

అర్జునమ్మకు మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ


తామరబ్బలో అర్జునమ్మ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి : తామరబ్బ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు కడారి అర్జునమ్మ అనారోగ్యానికి గురికావడంతో ఇటీవల ఆపరేషన్ చేయించుకోని ఇంటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలోనే మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తామరబ్బలోని అర్జునమ్మ ఇంటికి శనివారం చేరుకొని పరామర్శించారు. ఈ సందర్భంగా అర్జునమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ అర్జునమ్మకు మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, స్థానిక సర్పంచ్ టోకురి రామకృష్ణ, ఉప సర్పంచ్ గుమ్మడపు దేవి, గుమ్మడపు మహేష్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కడారి రాజు, దాకమర్రి శివాజీ తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.